క్లుప్తంగా

డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా



రేపల్లె: నేరాల నియంత్రణకు, మండల ప్రాంతం నిరంతర పర్యవేక్షణకు డ్రోన్‌ను వినియోగిస్తున్నామని చెరుకుపల్లి ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. డ్రోన్ కెమెరా ద్వారా గురువారం ఆయన మండల కేంద్రమైన చెరుకుపల్లి పరిసర ప్రాంత గ్రామాలను పర్యవేక్షించి మాట్లాడారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్లయితే వెంటనే తమకు సమాచారం తెలిసిపోతుందని ఇన్నాళ్లుగా చాటుమాటుగా కోడిపందేలు, జూదం, నిర్వహించేవాళ్లు ఇకనుంచి డ్రోన్ నిఘా నేత్రాల నుంచి తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. డ్రోన్ సహాయంతో మండలం మొత్తం నిఘానేత్రంలో ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు కూడా తమ పరిధిలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను పోలీసు వారికి వెంటనే తెలియపరచాలని తద్వారా నేరాలను నియంత్రించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

23 చేతి పంపులు ఏర్పాటు



కర్లపాలెం: గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం మండల పరిషత్ నిధులు రూ.2.50లక్షలతో 23 చేతి పంపులు ఏర్పాటు చేశామని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. మండల పరిషత్ నిధులతో గ్రామంలో ఏర్పాటు చేసిన 23 చేతి పంపులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాషాతో కలసి ఎంపీటీసీ సభ్యుడు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమోతువారిపాలెంలో చేతి పంపుల ఆవశ్యకతను గుర్తించి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు, ఎంపీపీ యారం వనజ ఎంపీడీఓ శ్రీనివాసరావులకు గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

11న జిల్లా అర్చకుల సమావేశం

ఎస్ఎస్ఎఫ్ జిల్లా దేవాలయ ప్రముఖ్ పి.సత్యనారాయణ



భట్టిప్రోలు: ఈ నెల 11న నవ్యాంధ్ర అర్చక, ఈనామ్ దారుల సేవా సమితి ఆధ్వర్యంలో చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని గంగాంబిక సమేత ఆనందీశ్వర స్వామి వారి దేవస్థానం (మూడు గుళ్ల శివాలయం) లో బాపట్ల జిల్లా అర్చకుల సమావేశం నిర్వహించనున్నట్లు సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. భట్టిప్రోలులో గురువారం జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్, బీజేపీ సంఘాలతో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. అర్చకులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వేంకటేశ్వరస్వామి జన్మించిన పర్వదినమైన ఈ నెల 9వ తేదీన శ్రావణమాసం శ్రావణ పౌర్ణమి, శ్రవణా నక్షత్రం అద్భుతమని పేర్కొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలు

భట్టిప్రోలు: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం భట్టిప్రోలు మండల విద్యా వనరుల కేంద్రంలో మండల పరిధిలోని హైస్కూళ్ల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో జి.దయాన (9వ తరగతి, టీఎంరావు హైస్కూల్, భట్టిప్రోలు), వై.హేమశ్రీ (పదవ తరగతి, వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్, సూరేపల్లి), చిత్రలేఖనంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో చలమచర్ల స్వరూప, (పదవ తరగతి, వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్, సూరేపల్లి), పాండావుల సురేష్, (పదవ తరగతి, టీఎంరావు హైస్కూల్, భట్టిప్రోలు)లు సాధించారు. విజేతలు 11వ తేదీన బాపట్లలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు మండల విద్యా శాఖాధికారి నీలం దేవరాజ్ ప్రకటించారు. విద్యార్థులను అభినందించారు.

బీజేపీ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం

మంగళగిరి: మండలంలోని చినకాకాని ఎన్ఆర్ఐ వై జంక్షన్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. నేతన్న విగ్రహం చుట్టూ పూలమాలలతో అలంకరించి నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. నాయకులు మాట్లాడుతూ నేతన్నలను ఆదుకునేందుకు వందలాది క్లస్టర్‌లను ఏర్పాటు చేసి నేతన్నలను బీజేపీ ఆదుకుంటుందన్నారు. మర మగ్గాలకు 500 యూనిట్లు, నేత కార్మికులకు 200 యూనిట్లు ఉచితంగా బీజేపీ అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో వీవర్స్ సెల్ కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా నవనీత్ కృష్ణారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తులిమిల్లి రామకృష్ణ, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు అందే శంకరరావవు తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఎన్నికల నిర్వహణలో అలసత్వం తగదు

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ



భట్టిప్రోలు సీపీఐ కార్యాలయం ఆవరణలో చేనేత జెండాను ఆవిష్కరిస్తున్న నేత కార్మికుడు పార్థసారథి, పక్కన నాయకులు

భట్టిప్రోలు: చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం సీపీఐ కార్యాలయ ఆవరణలో చేనేత జెండాను కార్మికుడు కొతరపు పార్థసారథి ఆవిష్కరించారు. బాలాజీ మాట్లాడుతూ చేనేత సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 127.87 కోట్లు బకాయిలను చెల్లించి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ రూ. 17.17 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ. 5 కోట్లు మాత్రమే చెల్లించడం శోచనీయమని తెలిపారు. కార్యక్రమంలో కె. రామకోటేశ్వరరావు, కె.వీర మోహన్‌రావు, ఏఐటీయుసీ నాయకులు బండారు శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత దినోత్సవం వేడుకలు

రేపల్లె: నూలుపోగును వస్త్రంగా మలచి సమాజానికి అందించిన నేతన్న కృషి ఎనలేనిదని ఇసుకపల్లి చేనేత సహకార సంఘం మేనేజర్ శోభన్ బాబు చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని ఇసుకపల్లి చేనేత సహకార సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నాడు స్వాతంత్ర్య పోరాటంలో విదేశీ వస్త్ర బహిష్కరణలో స్వదేశీ వస్త్ర అభివృద్ధిలో స్వాతంత్ర ఉద్యమ నాయకులు చేనేతకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చారన్నారు. వస్త్రాల బదులు నేతతో నేసిన వస్త్రాలను ధరించడం సైతం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేతను ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా పురవీధులలో ర్యాలీ నిర్వహించి ఇసుకపల్లిలోని మహాత్మా గాంధీ విగ్రహానికి నూలు మాలలు వేసి జోహార్లు అర్పించారు. కౌన్సిలర్ ఆకురాతి గంగమ్మ, మాజీ చైర్మన్ కె.వి. నాంచారయ్య, పాలకేంద్రం సెక్రటరీ అడిగోపుల వీర శంకర్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

బలిజేపల్లి(వేమూరు): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దాది సుబ్బారావు తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు రాయపూడి బుజ్జి బాబు, కస్తూరి సాంబశివరావు, గుండాల ప్రతాప్, రాయపూడి శ్రీనివాసరరావు, జంపని పురుషోత్తం, సి హెచ్ అంకమ్మరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమర్రులో...

పెనుమర్రు(వేమూరు): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు పేదలందరికీ అమలు చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటించి, తీరా అరకొరగా కొందరికి మాత్రమే అమలు చేస్తుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దాది సుబ్బారావు తెలిపారు. వేమూరు మండలం పెనుమర్రు గ్రామంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను వివరించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు కర్లపూడి ఆనంద్, సిద్దెల రాజ కిషోర్, కొంతి నాగేంద్రం, జంపని పురుషోత్తం, వేమూరి శ్యామ్, సాంబయ్య పాల్గొన్నారు.



పెనుమర్రులో కూటమి మోసాలను వివరిస్తున్న, దాది సుబ్బారావు, నాయకులు

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

ఎరువుల దుకాణాల్లో ఏఓ తనిఖీలు



దుకాణంలో ఎరువులను పరిశీలిస్తున్న ఏఓ విజయరాజు

నిజాంపట్నం: కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సిహెచ్ విజయరాజు హెచ్చరించారు. మండలంలోని కూచినపూడిలోని ఎరువుల దుకాణాన్ని గురువారం ఆయన సందర్శించి ఆయా దుకాణాల యజమానులకు పలు సూచనలు చేశారు. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా దుకాణాలలో సైతం యజమానులు నాణ్యమైన ఎరువులు విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆయా దుకాణాల యజమానులు రైతులకు నాణ్యమైన ఎరువులను మాత్రమే విక్రయించాలని సూచించారు. నాణ్యత లోపించిన ఎరువలను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు తప్పనిసరిగా అందించాలన్నారు. రైతులు సైతం తాము కొనుగోలు చేసిన ఎరువులు దుకాణంలో రసీదును పొందాలని సూచించారు. మండలంలో సాగు చేసే 5045 హెక్టార్లుకు సరిపడా డీఏపీ ఎరువులను విడతల వారీగా అందించనున్నట్లు పేర్కొన్నారు. కో–ఆపరేటివ్ సొసైటీలకు ఎరువుల స్టాక్ వచ్చేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట వీఏఏలు ప్రియాంక సుధారాణి, వీహెచ్ఏ అశోక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని మండల విద్యా శాఖాధికారి–1 సీహెచ్ వనజాక్షి సూచించారు. మండల విద్యావనరుల కార్యాలయంలో ఉపాధ్యాయులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఈఓ–2 రమేష్ మాట్లాడారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు, పావులూరు లక్ష్మి, శివశంకరావు, ఎమ్మార్సీ సిబ్బంది కోటేశ్వరరావు, అనిత, సీఆర్పీ ప్రసాద్, భాస్కరరావు, ప్రసన్న, ప్రశాంతి పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం



కర్లపాలెం: నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం కృషి చేస్తుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు చెప్పారు. కర్లపాలెం ఎఫ్‌సీఐ గోదాములలో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యేలు ప్రారంభించారు. బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్, కర్లపాలెం టీడీపీ అధ్యక్షుడు వై.భూపతిరావు, తహసీల్దార్ షాకీర్ పాషా, ఆర్ఐ మాధవ్ కిరణ్, వీఆర్వో సాంబయ్య ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అధికారులతో సమీక్ష

వేమూరు: సీజనల్ వ్యాధులపై అధికారులందరు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌమ్య తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై వివిధ శాఖల అధికారులు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పారిశుద్ధ్యం లోపం వల్ల గ్రామాల్లో విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ చొప్పర శేఖర్, తెనాలి మలేరియా సెక్టార్ అధికారి ఉమాకాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



కర్లపాలెం: వంట గ్యాస్ సిలిండర్ల నుంచి మినీ సిలిండర్లకు గ్యాస్ నింపటం చట్ట ప్రకారం నేరమని సివిల్ సప్లయి డీటీ ఫణికుమార్ చెప్పారు. కర్లపాలెం సెంటర్‌లో షాపుల మధ్య ఓ వ్యక్తి అనధికారికంగా వంట గ్యాస్ సిలిండర్ల నుంచి మినీ సిలిండర్లకు గ్యాస్ నింపుతున్నాడని తమకందిన సమాచారం మేరకు గురువారం తనిఖీ చేశామని సీఎస్ డీటీ తెలిపారు. ఈ తనిఖీలలో ప్రభుత్వం వంటకు ఇస్తున్న సబ్సిడీ సిలిండర్లను మూడింటినీ గుర్తించి సీజ్ చేశామని చెప్పారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్లు సీఎస్ డీటీ వివరించారు. ఈ తనిఖీలలో కర్లపాలెం వీఆర్వో సాంబయ్య తదితరులు ఉన్నారు.

రుణాలివ్వాలని కౌలు రైతుల ధర్నా



వలివేరులో గ్రామీణ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

చుండూరు(వేమూరు): సాగు కోసం రైతు మిత్ర గ్రూపులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని గ్రూపు సభ్యులు డిమాండ్ చేశారు. చుండూరు మండలంలోని వలివేరు ఆంధ్రా గోదావరి గ్రామీణ బ్యాంక్ కార్యాలయం ఈమేరకు రైతు మిత్ర గ్రూపు సభ్యులు గురువారం ధర్నా చేశారు. కౌలు రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నగదు కూడా వేయడం లేదన్నారు. బ్యాంక్‌లు రైతు మిత్ర గ్రూపుల సభ్యులకు రుణాలు ఇవ్వాలని రెండు రోజుల నుంచి ధర్నా చేస్తున్న బ్యాంకర్లు పట్టించు కోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతు మిత్ర గ్రూపుల సభ్యులకు, వ్యవసాయ సాగు చేసే ప్రతి కౌలు కార్డు ఉన్న కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకు సిబ్బంది చుండూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీనివాసరావు బ్యాంక్ వద్దకు చేరుకుని కౌలు రైతు సంఘం నాయకులతో, బ్యాంక్ మేనేజరుతో చర్చలు నిర్వహించారు. రుణాల మంజూరు విషయం పై అధికారుల దృష్టికి తీసుకెళతానని బ్యాంకు మేనేజర్ హామీ ఇచ్చారు. ఆందోళనలో తోడేటి సురేష్ కౌలు రైతులు పాల్గొన్నారు.

మంచెం సుబ్రహ్మణేశ్వరరావుకు గౌరవ సత్కారం



బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వవిద్యార్థి మంచెం సుబ్రహ్మణేశ్వరరావు గౌరవ సత్కారానికి ఎంపికయ్యారు. 1973 బ్యాచ్‌కి చెందిన సుబ్రహ్మణేశ్వరరావు ఆంధ్రాబ్యాంక్‌లో ఏజీఎం హోదాలో ఉద్యోగ విరమణ చేశారు. మూడు సంవత్సరాల పాటు శ్రమించి శ్రీకూర్మదేవాలయంలోని కుడ్య చిత్రాలను వాటర్ కలర్ వాస్ టెక్నిక్ ద్వారా పునఃసృష్టించారు. అతి ప్రాచీన పద్ధతి ద్వారా దేవాలయ గోడల మీద వెలిసి పోతున్న అత్యంత పురాతన కాలం నాటి బొమ్మలను తిరిగి గీశారు. ఇవి సుప్రసిద్ధ చిత్ర కారులను సైతం ఆశ్చర్యంలో ముంచెత్తాయి. ఈ కృషిని గుర్తించి శ్రీ కూర్మ దేవాలయం వారు ఆగస్టు 10న గోవా గవర్నర్ పి.అశోక్ గజపతి రాజు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చేతులమీదుగా శ్రీ కూర్మంలో మంచెం దంపతులను సత్కరించనున్నారు. ఈమేరకు సుబ్రహ్మణేశ్వరరావును పలువురు అభినందించారు.

అథ్లెటిక్స్‌లో జెడ్పీ హైస్కూలు విద్యార్థుల ప్రతిభ



ఉపాధ్యాయులతో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

తెనాలిరూరల్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గురువారం జరిగిన అథ్లెటిక్ పోటీల్లో మండలంలోని అంగలకుదురు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 800 మీటర్ల పరుగుపందెంలో పాఠశాలకు చెందిన ఆంజనేయులు, ప్రశాంతిలు ద్వితీయ స్థానంలో నిలిచారు. అలానే 400 మీటర్ల పరుగుపందెంలో పి.వైష్ణవి ద్వితీయ స్థానంలో నిలిచింది. త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. అలానే గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాఠశాలకు చెందిన కె.హన్విత, డి.సమంత, యు.విజయశ్రీ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీఈటీలు వేమూరి శరత్‌బాబు, పులివర్తి రవిరాజులను పాఠశాల హెచ్ఎం ఎన్.అనురాధ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పత్తి పొలంలో లింగాకర్షక బుట్టలు

కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె. వీరయ్యచౌదరి



పంటను పరిశీలిస్తున్న వీరయ్యచౌదరి

ప్రత్తిపాడు: పత్తి పంటలో రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె. వీరయ్యచౌదరి అన్నారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో గురువారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె. వీరయ్యచౌదరి రైతులు సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరయ్యచౌదరి మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంట 25–30 రోజుల దశలో ఉందన్నారు. రసం పీల్చే పురుగులైన పేనుబంక, తెల్లదోమలను పత్తి మొక్కలపై గమనించడం జరిగిందన్నారు. అయితే రసం పీల్చే పురుగులు ఆర్థిక నష్టపరిమితి స్థాయి కన్నా తక్కువగా ఉన్నాయని, అందుచేత పురుగు మందులు వినియోగించాల్సిన అవసరం లేదన్నారు. అయితే పత్తి పంట 40–45 రోజుల దశలో ఉన్నప్పుడు ఎకరాకు ఎనిమిది నుంచి పది వరకు లింగాకర్షక బుట్టలు అమర్చుకుని గులాబీ రంగు పురుగుల ఉధృతిని గమనించాలన్నారు. గుంటూరు ఏడీఏ ఎస్.మోహన్‌రావు మాట్లాడుతూ రైతులు ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్, సీసీఆర్సీ కార్డుల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఏవో షేక్ సుగుణ బేగం, వీహెచ్ఏ వి.షణ్ముఖ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కుంటల్లో గంబూషియా చేపలు విడుదల



భట్టిప్రోలులో చేప పిల్లలను విడుదల చేస్తున్న సర్పంచ్ రవికిరణ్మయి

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీలో ఎక్కడైతే నీరు నిల్వలు, చెరువులు, డ్రెయినేజీలు ఎక్కువగా ఆవాసాలుగా ఉండే ప్రాంతాల్లో దోమల నివారణ నిమిత్తం గంబూషియా చేపలను విడుదల చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి గురువారం తెలిపారు. గంబూష్ చేపలు దోమల గుడ్లులను తినడం వల్ల నివారించవచ్చునని పేర్కొన్నారు. తద్వారా దోమల కాటు ద్వారా వచ్చే విష జ్వరాలను నిర్మూలన చేయవచ్చునని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది విష జ్వరాలు ప్రబలే ఏరియాలలో తక్షణమే శుభ్రం చేసి బ్లీచింగ్, సున్నం చల్లించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత వాతావరణం వల్ల దోమ కాటు వల్ల ప్రజలకు విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉండదని అందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణ్య

రేపల్లె: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మొల్లగుంట పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్య చెప్పారు. పౌష్టికాహారం, బాలల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిశోర బాలికల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండలంలోని మొల్లగుంట పీహెచ్‌సీ కేంద్రంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగనవాడీ కార్యకర్తలకు గురువారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి ఐదు సంవత్సరాల వరకు బాలలు ఎదుర్కొనే సమస్యలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, జాగ్రత్తలను వివరించారు. కిశోర బాలికల ఆరోగ్యంపై జాగ్రత్తగా వహించాలన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ క్రాఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ట్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ ఝాన్సీ, వీఎస్ లక్ష్మీ, రంగారావు, హెల్త్ సూపర్వైజర్ ప్రేమకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన తల్లి పాల వారోత్సవాలు

ఐలవరంలో సీమంతాలు



సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంపూర్ణ, కార్యదర్శి సురేష్‌కుమార్

సూరేపల్లి(భట్టిప్రోలు): గత వారం రోజులుగా అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. భట్టిప్రోలు సెక్టార్ పరిధిలోని ఐలవరం గ్రామంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంపూర్ణ అధ్యక్షతన సామూహిక సీమంతాలు నిర్వహించారు. తల్లి పాలు బిడ్డకు ఎంతో ఆరోగ్య కరమని, అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లి పాలు బిడ్డకు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు తల్లి పాల విశిష్టత గూర్చి అవగాహన కల్పించారు. బిడ్డకు డబ్బా పాల కన్నా తల్లిపాలు ఎంతో మంచిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయం–2 కార్యదర్శి వక్కలగడ్డ సురేష్‌కుమార్, ఏఎన్ఎం అరుణజ్యోతి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

అమర్తలూరు(వేమూరు): తల్లి పాలు అమృతంతో సమానమని మోపర్రు మండల ప్రాథమిక వైద్యాధికారి షరీఫ్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాలు వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఆశా కార్యకర్త అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.ఉషా, జి.రాజకుమారి, పి.లీలావతి, జి.ప్రసన్న, తల్లులు పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



బీపీ మండల్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు

గుంటూరు రూరల్: వెనుకబడిన వర్గాల ఆరాధ్యుడు బీసీ రిజర్వేషన్ల సాధకుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ డేను గురువారం బీసీ నాయకులు అభిమానులు ఘనంగా నిర్వహించారు. అమరావతిరోడ్డులోని చిల్లీస్ సెంటర్ నందున్న బీపీ మండల్ విగ్రహానికి బీపీ మండల్ డే సందర్భంగా పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ భగత్‌సింగ్ మాట్లాడుతూ బీపీ మండల్ 40 సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 40 సిఫారసుల్లో కేవలం ఒక్కటి మాత్రమే అమలు చేశారని ఇది అన్యాయమన్నారు. ఇటీవల బీజేపీ ప్రభుత్వం అగ్రవర్ణాలు అడగకముందే ఓబీసీ కేటగిరిలో వారికి 10 శాతం రిజర్వేషన్‌లు కల్పించారని, ఇది మరింత దుర్మార్గమన్నారు. జనాబా థామాషా ప్రకారం రిజర్వేషన్‌ల సంఖ్య పెంచాలని పెద్దెత్తున డిమాండ్ ఉన్నప్పటికి వాటిని లెక్క చేయకుండా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు రమణప్ప, వాసు, ఉగ్గం సాంబశివరావు, దాసరి శివకుమార్, నరశింహారావు పాల్గొన్నారు.

హరిత విప్లవ సాధనకు స్వామినాథన్ ఎనలేని కృషి

నగరంపాలెం: హరిత విప్లవ సాధనకు స్వామినాథన్ ఎనలేని కృషి చేశారని వక్తలు కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కల్యాణ వేదికపై గురువారం భారతరత్న ఎం ఎస్.స్వామినాథ్ శత జయంతి వేడుకలను గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ పాలకమండలి నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ అధ్యక్షులు మన్నె సుబ్బారావు ప్రసంగిస్తూ ఎంఎస్.స్వామినాథన్ గ్రీన్ రివల్యూషన్ ప్రణాళికలు, కృషి క్షేత్రం ఆధునికీకరణలో పెద్ద పాత్ర పోషించారని తెలిపారు.

10న ఎస్‌హెచ్‌ఓలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఓ) హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 10వ తేదీ (ఆదివారం) న్యూరాలజీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి .సేవకుమార్, పావులూరి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.